322118801

విద్యానామ నరస్యరూప మధికమ్ ప్రచ్ఛన్న గుప్తంధనమ్
విద్యా భోగకరీ యశస్సుఖకరీ విద్యాగురూణాం గురుః
విద్యా బన్ధు జనో విదేశ గమనే విద్యా పరాదేవతా
విద్యా రాజ సుపూజ్యతే నహిధనం విద్యావిహీనః పశుః.

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా! విద్యాబోధకులారా! విద్యాభిమానులారా!

విద్యయే మానవునకు సౌందర్యము. విద్యయే మానవునకు గుప్తధనము. విద్యయే భోగము. విద్య గురువులందరి కంటె గొప్ప గురువు. విదేశ యాత్ర సలిపినప్పుడు విద్య మనకు గొప్ప బంధువు వలె తోడ్పడుతుంది. విద్య మరొక నేత్రము, దృష్టి. రాజుల చేత పూజింపబడేది విద్య కాని ధనము కాదు. ఇట్టి పవిత్రమైన దివ్యమైన విద్య నోచుకోలేని వాడు పశువుతో సమానము.

సత్యామృతంబును చవిచూడకున్నచో
చెల్లనే తానొక్క కల్ల బొమ్మ
ధర్మంబు నెరుగక దనుజుండు యగుగాని
మానవుండెట్లగును మహితవృత్తి
శాంతి పొందని వాడు శార్దూలమేగాని
మానవుడెట్లగు మనసు లేక
ప్రేమ లేని నరుడు బీటలు వారిన
మరుభూమియగు గాని మనుజుడగున
కాన నాలుగు గుణములు క్రమము తప్ప
పట్టుదల తోడ సాధింప పరమ విద్య
ఇంతకన్నను ఘనవిద్య యేమి కలదు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులారా.

ప్రేమస్వరూపులారా!

స్థూల జగత్తుకు, జీవలోకమునకు, మానసిక సీమకు, సాంఘిక జీవితానికి మూలమై ఆధారమై వున్న సత్యమునకు ప్రత్యక్ష స్వరూపమే విద్య. మన నిత్యజీవితములో యెదురయ్యే సమస్యలను, సవాళ్లను యెదుర్కొనే మానసిక ధైర్య స్థైర్యము, శక్తిని చేకూర్చునదే విద్య. సృష్టియొక్క రూపనామములను తీర్చిదిద్దునదే విద్య. దివ్యమానస తత్వాన్ని గుర్తించినప్పుడే ప్రపంచమునకు సంఘమునకు తనలో వుండిన సమస్త శక్తులకు సన్నిహిత సంబంధమైన బాంధవ్యము యేర్పడుతుంది. ఏవత్ మానవజాతి ఒక్క కుటుంబముగా

322118902

నిరూపింప జేయునదే దివ్యమైన విద్య. సమాజము లోని సమస్త శక్తులను ఏకీభవించి ఏకత్వములో అనుభవింప జేయునదే విద్య.

కాని యీనాటి విద్యావిధానము మనము సరైన స్థితిలో అనుభవించుటకు అవకాశములు లేకపోవుచున్నవి. లోకములో అనేక మంది మేధావులు వున్నారు. వైజ్ఞానికులు కలరు. కాని యిట్టి మేధావులను, వైజ్ఞానికులను, సక్రమమైన మార్గమును అనుసరింపచేసే సరైన విద్యలేక పోవటము చేతనే యీ మేధాశక్తి, వైజ్ఞానము పెడమార్గము పట్టి జగత్తులో అనేక విధములైన అశాంతులకు గురిచేస్తున్నవి. ఈ నాటి విద్యావిధానము యింద్రియముల తృప్తి పరచే నిమిత్తమే అదియే పరమ లక్ష్యమని భావిస్తూ వున్నారు. ఈనాటి విద్య కేవలము తెలివి తేటలను మాత్రమే చేకూర్చు చున్నది గాని గుణములను యేమాత్రము కూడను అభివృద్ధి చేయుటం లేదు. ఇట్టి విద్యావిధానము సంస్కరింపజేసే నిమిత్తమై మన భారతనాయకులు అనేక విధములైన ప్రయత్నములు సలుపుతూ వచ్చారు. ఎన్నియో కమిటీలను స్థాపించినారు. కానీ యివన్నీ కూడను come for tea యింతమాత్రము చేతనే యివి వివరించుచున్నవిగాని విద్యావిధానమును సరైన మార్గములో తీర్చిదిద్దటానికి ఎవ్వరూ కూడను గట్టి సంకల్పము చేయలేదు. కావలసినన్ని ప్లానులు వేసినారుగాని అది ఆచరణలో నిరూపించలేదు. దీనికి కారణము ఏమిటి? భారతీయులు అనేక కష్టములకు, నష్టములకు దుఃఖములకు కట్టుబడి లెక్క చేయక స్వరాజ్యమును మాత్రమే సాధించగలిగిరి గానీ ఏకమత్యమును సాధించలేక పోయారు. ఏకమత్యము లేకపోటమే యిన్ని దురవస్థలకు మూలకారణము. ఏకమత్యమే జీవితము యొక్క పరమధర్మము. ఇట్టి ఏకమత్యము చేత మానవుడు సాధించలేనిది జగత్తులో యేమియు లేదు. అట్టి జీవితమునకు మూలాధారమైన ఏకమత్యమును విస్మరించి కేవలము లౌకికమైన స్వరాజ్యమును ఆశించటము చేతనే భారతదేశము యిన్ని కష్టములకు, నష్టములకు, దుఃఖములకు గురికావలసి వచ్చింది. విద్యావిధానములో కావలసినన్ని మార్పులు చేయాలి.

ఈ విద్యావిధానమునకు తగిన వివేక విజ్ఞానములు కూడను అభివృద్ధి పరచాలి. కాని దురదృష్టవశాత్తు విజ్ఞానము పెరిగినదిగాని దానికి తగిన వివేకము పెరగలేదు. వినయము లేని విజ్ఞానము కేవలము నిరుపయోగము. విద్యలో వినయమూ ప్రధానమైన ప్రాణము. ఇలాంటి ప్రాణసమానమైన వినయమును మనము కోల్పోయినాము. దేశము యొక్క భవిష్యత్తు లక్ష్యము నందు యేమాత్రము వుంచుకొనుట లేదు. కనుకనే మానవుని యందు సుజ్ఞాన ప్రజ్ఞానములనేవి శూన్యమై పోయినవి. కాని యీనాటి భారతీయుల యొక్క భావము విద్యాభివృద్ధి పెరిగినదని ప్రతి పల్లె యందు విద్యాసంస్థలు స్థాపింపబడినవని యీ విద్య చాలా ప్రోగ్రెస్సు అభివృద్ధిలో నున్నదనియు భావిస్తున్నారు పాపం పెద్దవారు కేవలము విద్యాసంస్థలు పెరిగినంత మాత్రమున విద్య పెరిగినదని భావించుకొనుటము

322118803

వెచ్చితనమే. కోట్లకు ఖర్చుపెడుతున్నారు. కానీ విద్యావిధానమును గుర్తించుకొనలేక కేవలము విద్యాసంస్థలను అభివృద్ధి పరుస్తున్నారు. దీని యొక్క ప్రోగ్రెస్సు యేమిటి అని మనము చక్కగా లోతుకు దిగి విచారించిన

మేలు చేసిన వానినే గేలి సేయు
కూడు పెట్టిన దాతనే కూలద్రోయు
విద్య చెప్పిన గురువునే వెక్కిరించు
ఇదియె ప్రోగ్రెస్సు ఈనాటి విద్యయందు
సంఘ సంస్కారమంతయు గంగ కలిసె
మనుజ జాతికి తృప్తియే మాయమయ్యె
శీలవతులు జగతిలో క్షీణమయ్యె
ఇదియె ప్రోగ్రెస్సు విద్యయందు
భవ్యభావాలు ఎరిగిన భారతీయ
సంఘ సంస్కృతి గుర్తింపనేర్వరైరి
భారతీయులు యత్నింపనేరకున్న
ఇంతకంటెను దురదృష్టమేమి కలదు.

సర్వసంస్కృతియందు ఆరితేరిన భారతదేశము యీనాడు ఆ సంస్కృతినే గుర్తించటానికి ప్రయత్నించటమే లేదు. సంస్కృతిని గుర్తించిన భారతీయులే దానిని ఆచరణయందు పెట్టుటకు ప్రయత్నించుట లేదు. అసలు సంస్కృతి అంటే యేమిటో యీనాటి విద్యార్థులకు అర్థము కాదు. దివ్యమైన మానవత్వాన్ని పరిపూర్ణత్వము గావించేదే సంస్కృతి అనే సత్యాన్ని విస్మరించి పోతున్నారు. శరీర మనస్సు ఆధ్యాత్మిక తత్వాన్ని అర్థము చేసుకొనటానికి తగిన ప్రయత్నము చేయటంలేదు. నిత్య జీవితములో సమగ్రతా భావాన్ని సాధించేదే సంస్కృతి. శరీరమునకు, మనస్సునకు, ఆత్మకు వుండిన సరైన సంబంధ బాంధవ్యాన్ని గుర్తించి యేకత్వమును భావించటమే సంస్కృతి. మానవత్వాన్ని పరిపూర్ణమైన భావముతో అనుభవింప జేయునదే సంస్కృతి. జాతిమత భేదములకు యేమాత్రము లొంగక ఏకత్వమైన దైవత్వమునే గుర్తింప చేయునది సంస్కృతి. అనేకత్వములోని యేకత్వమును నిరూపింప చేయునదే సంస్కృతి. ఇట్టి పవిత్రమైన సంస్కృతిని యెంతవరకు వర్ణించినప్పటికిని తనివి తీరదు. అట్టి దివ్యమైన, భవ్యమైన భారతీయ సంస్కృతి యీనాడు విద్యార్థులు యేమాత్రము గుర్తించుటకు ప్రయత్నించుట లేదు. కనుక యీ భారతీయ సంస్కృతి కేవలము భారతీయులకు మాత్రమే కాకుండా యావత్ప్రపంచమునకు నాయకత్వాన్ని, దివ్యమైన మార్గాన్ని నిరూపింప జేయునదే సంస్కృతి అనే సత్యాన్ని మనము గుర్తించాలి.

పాపభీతి, దైవప్రీతిని కూడను సంస్కరింప చేయునదే సంస్కృతి.

3221188O4

పాప భీతి లేని పామరత్వము బట్టి
దైవ ప్రీతి లేని దాని బట్టి
మానవత్వ వడగె మానవులందున
ఇంతకన్నను దౌర్భాగ్యమేమి కలదు.

ఈనాడు యెట్టి చదువులు ఎరగనట్టి పల్లెజనులయందున్న పవిత్రమైన భావములు చదువుకున్న పట్టణముల యందున్న విద్వాంసుల యందు యేమాత్రము కనుపించలేదు. కొండ జాతివారు, కోయ జాతివారికి వుండిన నీతి నియమములు కూడను యీనాటి విద్వాంసులలో కనుపించటంలేదు. ఎక్కడ విద్యాసంస్థలు, ఎక్కడ విశ్వవిద్యాలయములు, ఎక్కడ కోర్టులు, కచ్చేరీలు అధికముగా పెరిగినవో అక్కడే అన్యాయములు, అక్రమములు, అనాచారములు అధికమై పోతున్నాయి. ఈ కోర్టు, కచ్చేరీలు, విద్యాసంస్థలు లేని పల్లె ప్రజలయందే నీతి నిజాయితీలు యింకా అంతో ఇంతో ప్రకాశిస్తున్నాయి. కనుక యీ విద్యాభివృద్ధి వల్ల కలిగిన ఫలితము యేమిటి? మానవత్వాన్ని మరచి కేవలము పశుత్వాన్ని పెంచుకుంటున్నాము. స్వేచ్ఛా విహారాన్ని ఆశిస్తున్నాము. ఇంద్రియ భోగములకై పాటుపడుతున్నాము. మానసిక శాంతికి నోచుకోలేక అతి దూరమై పోతున్నాము. కానీ విద్యార్థులు వున్న ప్రదేశము శాంతి భద్రతలతో కళకళలాడుతూ వుండవలసిన విద్యాసంస్థలు యీనాడు భయభ్రాంతులతో కుళ్ళి కునారిల్లి కూలిపోతున్నవి. ఈ విద్యయొక్క విశిష్టత యేమిటి? మనము నేర్చిన విద్యను సమాజములో సమన్వయము గావించుకొని సక్రమమైన మార్గములో ఆదర్శవంతమైన జీవితాన్ని అందించుటయే విద్యయొక్క పరమ లక్ష్యం. ఇంతే కాదు యింకనూ యింకనూ యెన్నోవిధములైన అవినీతి మార్గమునందు ప్రవేశపెడుతున్నది యీ విద్య.

ఈనాడు Science and Technology కావలసినంత పెరిగిపోతున్నది. ఈ విద్యావిధానము లోపల వైజ్ఞానిక శాస్త్రము మరింత మితిమీరి పోతున్నది. ఈ విజ్ఞానము సమాజములో పరిజ్ఞానము అభివృద్ధి గావించినది నిజమే. కాని యీ విధమైన పరిజ్ఞానము మనకు చేసిన మేలుకంటె కీడునే అధికముగా కనుపిస్తున్నది. ఈ సాంకేతిక విజ్ఞాన శాస్త్రము మానవునకు అందించే సుఖము కంటె దుఃఖమే అధికముగా వుంటున్నది. నిజమైన శాంతిభద్రతలు మానవ జీవితములో అనుభవించటానికి యేమాత్రము అవకాశము లేకుండా చేస్తున్నవి. ఈనాడు వైజ్ఞానిక శాస్త్రములో వీడియోలు రేడియోలు అధికమై పోయినవి. సినిమాలు, విమానాలు అధికమైపోయినవి. టెలివిజన్లు అనేక విజన్లు అధికమై పోయినాయి. కాని divine vision మాత్రము కనుపించుటంలేదు దీని వల్ల మానవుని యొక్క నిత్యజీవితము మరింత భారముగా గోచరిస్తుంది. మానవ జీవితము చాలా భయము తో కూడి వుంటున్నది. ఈ సాంకేతిక విజ్ఞాన శాస్త్రము మానవుని మనశ్శాంతికి దూరము చేస్తున్నది. మానవుని యొక్క దేహపరిస్థితి యందు కూడను

322118804

దిన దినమునకు క్షీణించి కేవలము బలహీనత గావించు చున్నది. నీతి నిజాయతీలను నేల మట్టము గావించుచున్నది. ఏవిధముగా? ఈ నాడు కొన్నివిధములైన ఆదర్శములను మనము అనుభవముగా తీసుకుంటే యెంత్తైనా కూడను ఈ యొక్క అవినీతి విజ్ఞానము మూలకారణమనేది స్పష్టము గావించు చున్నది. వీడియోలు, రేడియోలు, యివి అందరి యిండ్లయందును కఠినముగా వుండియే తీరాలి. వీడియో లేని యిల్లు అది కేవలము ఒక అనాగరికముగా తోస్తుండడది. మధ్య తరగతిలో జీవించే అధికారి యొక్క స్థితి ఎటువంటిదని మనము విచారిస్తే యీ పరిస్థితులవల్ల తన యొక్క జీవితము చాలా అశాంతికి గురై పోవుచున్నది. అతనికి వచ్చే జీతము వెయ్యి, వేయి యిదువందలో వుంటాయి. కానీ యీ ధనముతో తాను వీడియోలు తీయగలడా, రేడియోలు తీయగలడా టెలివిజన్లు తీయగలడా ఏమీ తీయలేడు. లేకపోతే ఆయింటిలోనున్న ఆలుబిడ్డలు అనేక విధముల బాధలు పడతారు. ఆలుబిడ్డలు సంతోషపరచే నిమిత్తమై యీ వీడియోలు రేడియోలు కొనవలసి వస్తోంది. ఈ కొనటానికి చేతిలో డబ్బువుండదు. ఈ కారణము చేతనే లంచాలు ప్రారంభిస్తున్నారు. ఈ లంచాలకు మూలకారణము యేమిటి? ఈ సాంకేతిక విజ్ఞాన శాస్త్రమే మూలకారణము. కనుక యీ విధముగా క్రింది మొదలు పైవరకు తమ యింటి వారిని సంతృప్తి పరచే కోసమని, పిల్లలను ఆనందపరచే నిమిత్తమై అనేక విధములైన యీ వస్తువాహనాదులు సేకరించే నిమిత్తమై యీ లంచాలు ప్రారంభిస్తున్నారు. ఇక తమ పిల్లలకు చదువులు నేర్పించాలంటే అది మరింత కష్టముగా తోస్తుంది. ఒకటవ తరగతి చదివే పిల్లవానిని ప్రైమరీ స్కూలులో చేర్చాలంటే ఐదు వేలో, పది వేలో డొనేషను కట్టాలి. వాడు నేర్చుకునే చదువు కంటె వాని యొక్క uniform dress కు మరింత ఖర్చు కావాలి. ఆవిధముగా donation లేకుండా uniform లేకుండా పోతే ఆస్కూలులో ఆపిల్లలను చేర్చుకోరు. ఈ మధ్యతరగతి ఆఫీసరు యీధనమును యెక్కడ నుంచి తెస్తారు. కనుక వీరు చెడు మార్గమును పట్టటానికి ప్రయత్నిస్తున్నారు. ఈ విధముగా యీ విధముగా విజ్ఞానశాస్త్రమనేది మానవుని నిత్య జీవితము లోపల గొప్ప అశాంతిని కలిగింప జేస్తుంది.

కనుక మన యింటిలో యెన్ని విధములైన బాధలు వుండినప్పటికిని పరిస్థితుల యొక్క ప్రభావమునకు మనము గురియైనప్పటికిని తినటానికి వుండటానికి అతికష్టముగా వుండినప్పటికిని బయటు మాత్రము మన ఆడంబరము మితిమీరి పోవున్నది. ఈ ఆడంబరము చేతను యీ అహంకారము చేతకూడను మానవుని యొక్క జీవితము అతివ్యయముతో కూడివుంటున్నది. ఈ నాటి డాక్టర్లను అనుకోండి, లాయర్లు అనుకోండి ఎవరైనా కాని చదువుకున్న అధికారులందరు కూడను బయటు తిరగాలంటే యేదో ఒక వాహనము కావాలి. ఇంటిలో యెన్ని విధములైన అవమానములు వుండినప్పటికిని బయట మాత్రము కార్లోనో మోటారుసైకిలుపైనో తాను సంచారము చెయ్యాలి.

ఈ విధమైన ఆడంబరము చేయకపోతే డాక్టర్లు దగ్గరకు పేషెంట్లు రారు, లాయర్ల దగ్గరకు క్లయింట్లు రారు. ఇది నిత్య జీవితము లోపల జరుగుతున్న ప్రధాన సమస్యలు. ఈ సమస్యలను తప్పించుకునే నిమిత్తమై వాటిని సాధించే నిమిత్తమై యీ అవినీతిలో పాల్పడుతున్నారు. ఏతావాతా యీ అవినీతికి కారణమేమనగా Science యొక్క అభివృద్ధి యీ మూల కారణము. Science చెడ్డది కాదు. అది వినియోగించుకునే విధానములో వుంటుండాది దోషము కనుక ఆ వినియోగించుకునే విధానము గురించిన విద్య మనకు అత్యవసరము. విద్య అనగా కేవలము పరిపూర్ణమైన ఆత్మజ్ఞానమనియే చెప్పవచ్చును. ఇలాంటి విద్యను నేర్చవలసిన యీనాటి విద్యార్థులు కేవలము యీ ఆధునిక విద్యలోపల అనేక కష్టములకు గురౌతున్నారు కేవలము అవగింజంత ఆధునిక విద్యను నేరుస్తే గుమ్మడికాయంత అహంకారము బయలుదేరుతుంది. ఇలాంటి విద్యావంతులకే భారతీయ సంస్కృతిపైన కేవలము విసుగు పుట్టుతున్నాది. ఇది సరియైన విద్య కానేరదు. నిజమైన విద్యను మనము గుర్తించటానికి ప్రయత్నించాలి.

విద్య కేవలము వృత్తినిమిత్తమై యేర్పడిన సంబంధమును మనము దూరము చెయ్యాలి. సమాజములో మనము గౌరవముగా న్యాయముగా జీవించటానికి తగిన సహాయము గావించేనదే విద్యయని మనము విశ్వసించాలి. సమాజములో గౌరవము కోల్పోయిన తరువాత మనకు విద్యలు కాపాడేది యేమిటి? మానవుని యొక్క నైతిక నిజాయితీలు పోషించటానికి తగిన కృషి చెయ్యాలి విద్యద్వారా. కృతజ్ఞతా జీవితాన్ని మనము అభివృద్ధి చేసుకోవాలి. కానీ యీనాడు అట్టి కృతజ్ఞత అనేది యెక్కడ కూడను కనుపించటము లేదు. కన్నతల్లి తండ్రులకు కూడను గౌరవించటానికి వెనుకంజ వేస్తున్నాడు విద్యావంతుడు. తన blood, తన head, తన parents gift అనే సత్యాన్ని మరచిపోతున్నాడు. తల్లితండ్రులను కూడను సరైన మార్గములో గౌరవించటానికి ప్రయత్నించటం లేదు. ఇది అవిద్య అనే చెప్పవచ్చుగాని విద్యఅని చెప్పటానికి వీలులేదు. జ్ఞానము యెంత పెరుగుతున్నదో జ్ఞానముతో బాటు అజ్ఞానము కూడను అంత నీడవలె వెంటాడుతూ వస్తున్నాది.

విద్యార్థులారా! మీరు విద్యాభ్యాసము చేయవలెనంటే కేవలము దేశము నిమిత్తమై మీరు విద్యనభ్యసించండిగాని నీనిమిత్తమై, నీస్వార్థ నిమిత్తమై విద్యనభ్యసించకండి. మన భారత దేశము యొక్క సంస్కృతి శాశ్వతముగా నిల్వాలనుకుంటే మీరు పవిత్రమైన, మన సంస్కృతిని అర్థము చేసుకోండి. భారతీయ సంస్కృతి వుండినంత కాలము భారతదేశము సుక్షేమముగా వుంటుంది. ఈ పవిత్రమైన సంస్కృతిని మనము యేనాడు కోల్పోతిమో అప్పుడు భారతదేశము మనకు లేదు. ఇట్టి దివ్యమైన సంస్కృతిని మీయొక్క దేహమునందు ఒక రక్తప్రమానముగా మీరు విశ్వసించాలి. ఇది కేవలము ఉండియున్న దీనిని పోషించటం చేతనే Indian culture అని వచ్చిందిగాని యిది ప్రపంచమునకే ఒక విధమైన సంస్కృతి. ప్రాచీన సంస్కృతిని పురస్కరించుకుని యీ

322118806

మానవత్వము దివ్యత్వాన్ని పోషించుటకు తగిన ఆధారమే యీ సంస్కృతి. ఈనాడు మానవుడు కనుపించుచున్నాడే గాని మానవత కనుపించటం లేదు. మానవతలేని మానవత్వము యేమిటిది. స్వరూప సందర్శనమునందు మాత్రమే మానవుడుగా నిరూపిస్తున్నాడు. అతనికి ప్రాణసమానమైన మానవత్వము కోల్పోవటం చేతనే యీ జగత్తునందు యిన్నివిధములైన అల్లకల్లోలములు అభివృద్ధి అయిపోయినవి. కనుక మనము సమాజమును విసర్జించటానికి వీలుకాదు. సమాజాన్ని మనము పోషించాలి.

ఈనాటి విద్యాసంస్థలన్నీ కేవలము పట్టములందించే కర్మాగారములుగా నిరూపిస్తూ వున్నాయి. కాని యిది కాదు విద్యాసంస్థల యొక్క లక్షణము. విద్యయందు వివేకమును, వివేకమునందు విజ్ఞతను కొంతవరకు అనుభవించి తద్వారా సమాజములో సమన్వయము గావించే స్థితిని మనము సంపాయించాలి. కనుక మనము చదివిన విద్యను కేవలము ఒక పట్టమునందుకొనే నిమిత్తమై యేదో ఒక పుస్తకము కంఠస్తము గావించినంత మాత్రమున మనము విద్యావంతులము కాము. మన జీవితమంతయు ఆదర్శవంతమైన రీతిగా సమాజములో మనము సేవచెయ్యాలి. సమాజమే మన యొక్క ప్రాణము. సమాజమునకు క్షణమైన మనము దూరముగా జీవించలేము. ఈనాడు తాను తన కుటుంబము క్షేమంగా వుండాలని మాత్రమే స్వార్థము, స్వప్రయోజనములో పాటుపడుతున్నాడే గాని విద్యావంతుడు సమిష్టియైన సమాజమును యేమాత్రము గుర్తించటము లేదు. ప్రాచీన కాలమునందు విద్యకు యెంతయో విలువనిచ్చేవారు. కేవలము ఆనాటి విద్యార్థులు simple life సహజమైన జీవితమును అనుభవించేవారు ఈనాటి ఆడంబరాలు ఆనాడు లేవు. వారి దుస్తులుగాని, వారి ప్రవర్తనలుగాని చాలా గౌరవమైన రీతిగా వారు ధరించేవారు. వారి నడతలు, వారి చర్యలు యెంతయో గౌరవముగా వుండేది. ఈనాటి విద్యావంతులయందుగాని, లేక విద్యాధికారులయందుగాని యీ వినయ విధేయతలు యేమాత్రము కనుపించవు manners అంటే యేమిటో వారికి అర్థము కాదు. Behaviour అంటే యేమిటో వారికి అర్థము కాదు. Discipline అంటే అసలే అర్థము కాదు. ఇలాంటి మమ్మూర్తులుగా వుండిన సుగుణములనే మనము యీనాడు అర్థము చేసుకొనలేక పోయిన మన విద్య యొక్క విలువ యేమిటి? కనుక మనము యీనాడు మన సమాజము లోపల గౌరవముగా బ్రతికి సమాజమును సరైన రీతిగా తీర్చిదిద్దే వ్యక్తులుగా మనము రూపొందాలి. కేవలము ఆధ్యాత్మిక మార్గమునందు కూడను ప్రకృతి నుండి ఆత్మలో ప్రవేశించటము కాదు ప్రధానము. ఆత్మనుండి ప్రకృతిలోకి ప్రవేశించామా అని చూడాలి. కేవలము ప్రకృతినే పరిపాలన చేసే దక్షులుగా మీరు తయారు కావలసిన విద్యావంతులు యీనాడు ప్రకృతికి వశమైపోయి దాసులుగా జీవిస్తున్నారు.

సత్యంవద, ధర్మంచర యీ రెండు సూక్తులను మీరు సరైన రీతిలో అర్థము చేసుకోటం లేదు. సత్యజీవితమనేది త్రికాల భాగ్యముతో కూడినది. భూత

322118807

భవిష్యద్వర్తమానములను సమన్వయము గావించునది. ఇట్టి సత్యాన్ని యీనాడు విస్మరించి
నారు. ధర్మమంటే వారి యిష్టాను సారము ప్రవర్తించటమే ధర్మమని భావిస్తున్నారు. కనుక
ఆనాటి గురుకులములో పూర్తి విద్యను అభ్యసించి గృహస్థాశ్రమములో చేరటానికి పోయిన
ప్పుడు గురువులు వారిని చెంత చేర్చి శ్రేయో మార్గమును, ప్రేయో మార్గమును బోధించి
ఆనాడు పిల్లలను వదలలేక వదలలేక కంటి ధారలతో గురువులు యింటికి పంపే వారు.
గురువులకు శిష్యులకు యింత సన్నిహిత బాంధవ్యము వుండేది. కానీ యీనాటి గురువు
లకు అట్టి వాత్సల్య భావముగాని, శిష్యులకు గురుభావముగాని, పితృ భావముగాని కనుపిం
చటంలేదు. కనుకనే యీనాడు విద్యాసంస్థలంతా కూడను పిల్లలు ఎప్పుడెప్పుడు బయ
టకు పోతారా అని ఆశపడుతూ వుంటారు, ఆనాడు విద్యార్థులను చూచి అధ్యాపకులు
భయపడవలసి వచ్చింది గానీ అధ్యాపకులను చూచి విద్యార్థులకు భయము యేమాత్ర
ము లేదు. ఇలాంటి విద్యార్థులకు సరైన విద్య యేరీతిగా చేకూరుతుంది. పాఠమును
బోధించటమే గురువు యొక్క ప్రధాన కర్తవ్యము. గురువును సేవించి గురువు యొక్క
ఆజ్ఞను శిరసావహించేటుకే శిష్యుని ప్రధాన లక్ష్యము. ఈనాడు యీరెండు కూడను యేమా
త్రము కనుపించటంలేదు. ఆనాటి విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా వుండేది. విద్యావిధాన
ము చాలా ఘనముగా వుండేది. కానీ యీనాడు విద్యార్థుల సంఖ్య పెరిగే కొలది విద్యావిధాన
ము తరుగుతూ వస్తుండాది. ఈ విధముగా గుణము తరగటము సహజమే. మనుష్యులు
యెక్కువయ్యే కొద్దీ మజ్జిగ పలచనౌతుంది అంటారు. ఈనాడు విద్యావిధానము చాలా
తక్కువగా వుంటున్నాది. ఆనాటి విద్యార్థులు ఒక్కొక్క క్లాసులో పదుమంది లేక ఆరు మంది
ఈ నాటి విద్యావిధానములో ఒక్కొక్క క్లాసుకు మూడు నాలుగుసెక్షన్లు పెడుతున్నారు. ఒ
క్కొక్క సెక్షనులో అరవై మంది, ఎనభైమందిని చేరుస్తున్నారు. ఈ విధమైన విద్యవలన
జగత్తుకు యేమి మేలు జరుగుతుందని ప్రభుత్వము కూడను గుర్తించటానికి ప్రయ
త్నించటము లేదు. ఏదో వచ్చిన వారినందరిని చేర్చుకోమని ఆర్డర్సు వేస్తూ వుంటారు.
ఇందులో చదివేవారు యెంతమంది చదవని వారు యెంతమంది తెలటానికే వీలులేదు
యీ విద్యా విధానములో ప్రభుత్వము సరైన శ్రద్ధను వహించటము లేదు. పాపము వారికి
కూడను సమయము చిక్కటము లేదు. వారి స్థానాన్ని నిలబెట్టుకోటానికి పోరాడటమే
సరిపోతున్నది కాలము. ఈనాడు విద్యావిధానము లోపల అమితమైన మార్పురావాలి.
సరైన విద్యను అభ్యసింప చేయటానికి ప్రయత్నించాలి. ఆ విద్యవల్లనే దేశము కూ
డను బాగుపడుతుందిగాని యిట్లా దినదినానికి విద్యతరిగి పోతుంటే యింక దేశము
యొక్క అభివృద్ధి యేమాత్రము వూహించటానికి వీలులేదు

విద్యార్థులారా! మీ తల్లి తండ్రులను మొట్టమొదట గౌరవించండి. స
మాజములో మీరు ప్రవేశించి సేవలలోపల మీరు కొంతవరకు శ్రద్ధ వహించండి. దే
శమే మన దేహముగా మనము భావించాలి. దేశ నిమిత్తమై విద్యనభ్యసించినట్లుగా

నీవు వూహించాలి. నీ శరీర, మనస్సు, ఆధ్యాత్మిక శక్తులన్నియు కూడను దేశమునకే ధార పొయ్యాలి. దేశ భక్తి లేని జీవితము వ్యర్థము

ఇది నాదు మాతృదేశము
ఇది ప్రియ మాతృభాష ఇది నామతము
యెదగొట్టి నుడువ నేరని
బ్రతికిన జీవి యెకండో వసుధను గలడా.

దేశాభిమానము వుండాలి. సమాజములో సరైన గౌరవమర్యాదలు సంపాదించుకోవాలి. తల్లి తండ్రుల ప్రేమకు పాత్రులు కావాలి. తల్లితండ్రుల ప్రేమకు పాత్రులుగా నోచుకోలేని యీ దురదృష్టవంతుడు దేశమునకు యేవిధముగా సేవ చేయగలడు. కాని యిలాంటి కొన్ని సంస్థలు యీనాడు అభివృద్ధి యైనప్పుడు దేశములో యింతైనను శాంతి భద్రతలు చేకూర్చ వచ్చును.

ప్రేమ స్వరూపులారా! విద్యయొక్క విషయాన్ని చక్కగా గుర్తించండి. కేవలము చదువు నేర్చినంత మాత్రమున విద్యార్థులు కారు.

చదివి వ్రాయ నేర్చిన వారంతా విద్యార్థులేనా?
కాలేజీ డిగ్రీలు పొంద విద్యావంతుడగునా?
సుజ్ఞానము సుకృతము లేని విద్యలు సద్విద్యలగునా?
బ్రతుకుటకే విద్యయన్న బ్రతుక లేవె పశుపక్షులు?

కనుక బ్రతుకు కోసము కాదు మన విద్య. కనుక యీ సత్యాన్ని మీరు గుర్తించండి. చదవ నేర్చినంత మాత్రమున విద్యావంతులు కాదు. వ్రాయ వచ్చు. చదవ వచ్చు. ఇది విద్యకు సంబంధము కాదు, ఇది కేవలము అభ్యాసములో చేకూరినది. విద్య హృదయముతో చేరాలి. హృదయము వరకు పోనటువంటి విద్య విద్య అవుతుందా? హృదయములో కూడి దానిని మనము ఆచరణలో పెట్టినప్పుడే యిదే ఆత్మ విద్య అన్నారు. ఈ ఆత్మ విద్యే ఆధ్యాత్మిక విద్య. విద్యానాం ఆధ్యాత్మిక విద్య. లౌకిక మైన విద్యలన్నియు చిన్న చిన్న కాలువల వంటివి. ఫిజిక్సు, కెమిస్ట్రీ, మేథమెటిక్సు, జూలాజీ యివన్నీ చిన్న చిన్న పిల్ల కాలువలు. ఆధ్యాత్మిక విద్య సముద్రము వంటిది. ఈ సర్వ విద్యలు ఆసముద్రములో చేరిపోవలసిందే. నదీనాం సాగరో గతిః. కనుక యీ సర్వ విద్యలతో బాటు ఆధ్యాత్మిక విద్యను కూడను అభ్యసించటం అత్యవసరము

ఆధ్యాత్మిక విద్య లేకపోతే యీ మానవత్వమే రాణించదు. ఆత్మవిశ్వాసము అత్యవసరము. కాని మనము దేనికో యేడుస్తున్నాము. దేన్ని మనం సాధించాలో దానిని మాత్రము మనం యేడ్వటం లేదు

పుట్టినప్పుడు ఏడ్చినావు చచ్చినప్పుడు ఏడ్చినావు
మధ్యమధ్య ఎన్నెన్నో విషయాలకు ఏడ్చినావు

322118809

ధర్మగ్లాని కలుగుచుండ వృద్ధిరింప ఏడ్చినారా
దేనికోసం ఏడ్చినారు ఏడ్పుకోసం ఏడ్చినారా.

ఇవేనా మీ ఏడ్పులు. తుచ్ఛమైన, అనిత్యమైన విషయ భోగములకై మీరు ఏడుస్తున్నారు. కానీ నిత్య సత్య ఆత్మ భావమునకై యేడ్చే వ్యక్తి ఒక్కడైనా కనుపించటము లేదు. ఈ విద్యను నేర్చినంత మాత్రమున మన హృదయము వికసించదు.

పుట్టపైన మర్దించిన పాము మరణమొందునా ?
తనువును తా దండించిన విషయ భోగముల దుంగునా?
ఆకలి దప్పులు మానినంత ఆత్మజ్ఞాని తానగునా ?
తానెవరో తెలియకున్న తత్వజ్ఞానమెటు కుదురు?

నీవు ఎవరో తెలుసుకోటానికి ప్రయత్నించటం లేదు. ఇంక ప్రపంచములో జరిగే అన్ని న్యూసులు కనుక్కోటానికి ప్రయత్నిస్తున్నావు. ఎన్ని న్యూసులు విని నీనుంచి వచ్చే న్యూసె న్నువు తెలుసుకోపోతే ఏమి ప్రయోజనము. కనుకనే నీవు ఖాలీగా అయిపోతున్నావు.

మొట్టమొదట నిన్ను నీవు తెలుసుకునేటట్టు చేసేదే విద్య. ఇట్టి విద్యను మనము అభ్యసించాలి. నేను మానవుడను మానవుడను అని మానవాకారము ధరించినంత మాత్రమున మానవుడు కానేరడు

ఆకుపచ్చ పక్షులన్ని చిలుకలవలె పలుకునా
పువ్వులపై పారాడెడు పురుగులు తుమ్మెదలగునా
పులిచర్మము కప్పిన గాడిద తాపులి యగునా
ఏనుగంత బలిసియున్న పంది ఏనుగగునటయ్యా

కనుక మనము మానవుల మనుకున్నందుకు, మానవాకారము ధరించినందుకు మానవత్వాన్ని మనము ధరించాలి, వరించాలి. కనుక మానవతా విలువలు పెంచుకోటానికి విద్యార్థులు ముందంజ వేయండి. ఈ యుక్తులతో, కుయుక్తులతో మీరు కేవలము మత్తులు కావద్దండి. మీయొక్క భావములు విశాలము గావించుకోండి. హృదయమును దివ్యమైన భావముగా రూపొందింప జేసుకోవాలి. యూవల్ సామ్రాజ్యము నా యొక్క గృహముగా భావించుకోవాలి. అప్పుడే unity in diversity అనేకత్వములోని ఏకత్వాన్ని నీవు దర్శించగలవు.

విద్యార్థులారా! తల్లి తండ్రులను గౌరవించి, గురువులను ప్రేమించి, దైవాన్ని విశ్వసించి అనేక విధములుగా మీ యొక్క జీవితాన్ని అర్పితము గావించుకున్నప్పుడే యిదే సరైన విద్య. ఇదే మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథి దేవో భవ. సర్వమానవుల యందు వుండిన దైవత్వాన్ని మీరు గుర్తించండి. అప్పుడే నిన్ను నీవు గౌరవించుకోటానికి పూనుకుంటావు. జీవితము దివ్యత్వమైన ఆనందములో వర్ధిల్లుతుంది.

322118810

Happy Happy Be Happy
Happy Happy Make others Happy
All will be happy GOD will be happy.